# రక్షా పరత్వం

'ఇక తన ప్రయోజకత్వం వల్ల లాభం లేదని నమ్మకం కుదిరాక ఆ గజరాజు మహావిష్ణువు సహాయాన్ని అపేక్షించాడు. "రావే యీశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా!, రావే కరుణింపవే తలపవే శరణార్థిని నన్ను గావవే!" అని ప్రార్థించాడు. ఆ లోకరక్షకుడు తన భక్తుని ప్రార్థన విన్నాడు. అతని అపాయస్థితి తెలుసుకున్నాడు. ఒక్క మాటు గుండెల్లో గుభేలుమంది. ఏమీ తోచలేదు ఒక్కక్షణం, సంరంభి అయిపోయాడు. ఆ స్థితి అటువంటిది. అప్పుడు— "సిరికిం జెప్పడు శంఖచక్ర యుగముం జేదోయి సంధింపడే పరివారంబును జీరడభ్రగపతిం బన్నింపడా కర్ణికాంతర ధమ్మిల్లము జక్కనొత్తడు వివాద ప్రోత్థిత శ్రీ కుచోపరి చేలాంచలమైన వీడడు గజప్రాణావనోత్సాహియై" అని

నరహరి తైలధారమాదిరి మాట్లాడేస్తున్నాడు. ఎలాగైనాసరే మిత్రుడు శంకరాన్ని ఒప్పించాలని.

"ఏరా నరహరీ! నేనేమన్నా సభ ననుకున్నవా యేరా? ఓరి నీ వాగుడుకూలా అది సరే కానీ, యింతకీ నీవాదన మానలేదన్నమాట" అన్నాడు శంకరం. అక్కడితో నాలుగురోజుల నుంచి వస్తున్న విషయం మార్చి మరో సంగతిలోకి పోదామనే వుద్దేశంతో.

"శంకరం, యిందులో వాదానికి అవకాశం లేదురా."

అనుభవశాలి పోతన కవీంద్రుని వాక్కులురా యివి...." ఒప్పించ వలసినంత పెద్ద విషయం కాదన్నట్టుగా అన్నాడు నరహరి.

శంకరానికి యీ ధోరణి నచ్చలా. అతిశయోక్తి అని అతని వాదన. ఆ సంగతి నరహరి ఒప్పుకోవాలని శంకరం అభిమతం.

"అంటే భక్తుడు పిలవంగానే పరుగెత్తాడంటావ్...." అన్నాడు వాదన కుపక్రమిస్తున్న కంఠంతో శంకరం.

"అంత తేలిగ్గా మాట్లాడబోకురా— భక్తజనరక్షా పరత్వంలో మొదట తత్తరపడి నిరాయుధంగా బయలుదేరి తర్వాత కొంచెం తమా యించుకుని పరికరాదులతో వెళ్ళాడు విష్ణుమూర్తి." నరహరి చెప్పింది శంకరం శ్రద్ధగా విన్నాడు. కాసేపు ఆలోచించాడు.

శంకరం మౌనాన్ని చూచి నరహరికి యింకా ధైర్యం వచ్చింది.

"ఒరేయ్ శంకరం! నీకే కాదురా నాయనా, శ్రీనాథుడంతటి వాడికే సంశయం వచ్చింది. ఆ కథ నీకు తెలిసే వుంటుందిలే.... మరి నూతిలో పిల్లవాడు పడితే తీయడానికి చేంతాడో గింతాడో తీసుకుపోవాలి గాని పెరుగన్నం తింటున్న చేత్తో ఎందుకు పరుగెత్తాడంటావ్!!.... అది నెమ్మదిగా ఆలోచించాలిరా? ఈ మాటలతో శంకరం మెత్తపడి తీర్తాడని నరహరి నమ్మకం.

"నరహరీ. నీవు చెప్పేదాంట్లో ఏవన్నా సమంజసమైన సంగతు లున్నాయేమోనని ఆలోచించే వాగుతున్నావురా?.... మా అమ్మాయికి

జ్వరం మహాతీవ్రంగా వుందండి. పలవరింతలూ, అదోలా చూపూ వెంటనే రావాలండీ డాక్టరుగారూ అని అనగానే డాక్టరు నుంచున్న వాడు నుంచునట్టు పరుగెత్తాలంటావ్.... అవునా? వంటింట్లో నుంచి భార్య "తేలండోయ్ తేలండోయ్" అని అరవగానే చేతిలో వున్న పత్రికతోనే పరుగెత్తుకు పోవాలంటావ్.... అవునా?"శంకరం తూచి తూచి మాట్లాడానని అనుకుంటున్నాడు.

ఈ సమస్య వాగ్వాదంతో ముగిసేదికాదని నరహరికి తోచింది. అయితే శంకరాన్ని యీ విషయంలో వొప్పించ లేకపోతే లోకువయి పోతాననే భయం వుంది నరహరికి. అనుభవంవల్లనే శంకరాన్ని దారికి తేవాలని నరహరి నిశ్చయించుకున్నాడు. మార్గం గూర్చి ఆలోచిస్తున్నాడు నరహరి.

నరహరి దగ్గర నుంచి వెంటనే జవాబు రాకపోవడంతో శంకరం తానే గెల్చాననుకున్నాడు— "కాబట్టి.... ఒకళ్ళని రక్షించేందుకు పోయినా, శిక్షించేందుకు పోయినా అన్నీ కాకపోతే కొన్నయినా సాధన సామాగ్రులతో పోవడం లోకంలో రివాజు.... కవిత్వం అన్నావ్. అందులో అతిశయోక్తులు వాడవచ్చు.... ఇప్పటికన్నా ఒప్పుకో...." అని ముగించాడు శంకరం. వాదాన్ని యీ దశలో పొడిగించడం నరహరికి యిష్టం లేదు. శంకరానికి చక్కటి అనుభవం కలగచేసి ఒప్పించాలని నరహరి తీర్మానించుకున్నాడు.

"పోనీరా.... ఎందుకొచ్చిన వాదన. మరోనాడు తీరుబడిగా చర్చించుకుందాంలే....లే, చాలా సేపయింది మనం వచ్చి. ఇళ్ళకు చేరుకుని నాలుగు మెతుకులు తిని పడుకుంటే నయం. రేపటి నుంచి మళ్ళా ఆఫీసూ మనం మామూలే" అన్నాడు.

మిత్రులిద్దరూ ఇళ్ళకు బయలుదేరారు.

*　　*　　*

శంకరం యీ విషయం మర్చేపోయాడు. కాని నరహరి మాత్రం మంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.

చక్కటి వుపాయం ఆలోచించాడు.

ఈ కార్యక్రమాన్ని నెరవేర్చేందుకు తమ స్నేహ బృందంలోని రామ్మూర్తి సహకారాన్ని కోరాడు. రామ్మూర్తి తక్షణం ఒప్పుకున్నాడు.

శంకరం ఇల్లు, నరహరి యిల్లు దగ్గర దగ్గరే వున్నాయి. రామ్మూర్తి ఇల్లు వీటికి ఎదురుగా వుంది.

ఒకనాడు శంకరం బజారుకు వెళ్ళాడు సామాను తేవడానికి శంకరం వెళ్ళడం కార్యక్రమం నెరవేర్చడానికి సిద్ధంగా వున్న నరహరి రామ్మూర్తి చూశారు.

శంకరం బజారు కెళ్ళిన యిరవై నిమిషాలకు రామ్మూర్తి నరహరి సైకిళ్ళ మీద బజారుకు బయలుదేరి వెళ్ళారు. ఫైరు స్టేషనుకు పైన యిరవై గజాల దూరంలో నుంచున్నాడు సైకిలు పట్టుకుని శంకరం కోసం రామ్మూర్తి. నరహరి ఫైరు స్టేషనుకు దిగువ నలభై గజాల దూరంలో నుంచున్నాడు కార్యక్రమం నడిపేందుకు.

బజారు పని పూర్తయ్యేక శంకరం తిరిగి వస్తున్నాడు. అతను రావడం దూరాన్నుంచే చూసి రామ్మూర్తి సైకిలు ఎక్కి శంకరానికి ఎదురు వెళ్ళాడు గాభరా ముఖంతో. శంకరాన్ని చూసి హఠాత్తుగా సైకిలు ఆపి "ఒరేయ్! శంకరం మీ షెడ్డు అంటుకుందిరా.... పెద్ద మంట!...." అన్నాడు. మాట సాంతం వినకుండానే శంకరం "ఆ!!!" అని అరిచి "రారా బాబూ త్వరగా అని యింటివేపు పిచ్చివాడి మాదిరి పరుగెత్తుతున్నాడు. ఫైరు స్టేషను దాటిపోయాడు. రోడ్డు పక్క నుంచున్న నరహరి చూశాడు శంకరం గాభరాని. శంకరాన్ని పిలిచాడు. "ఒరేయ్ శంకరం! ఏవిటిరా అలా పరుగెత్తుతున్నావ్. ఏమయిందిరా" శంకరం వేగం తగ్గించకుండా, "త్వరగా రారా బాబు మా షెడ్డు తగలబడుతోందిరా" అని పోతున్నాడు. ఇంతలోకే రామ్మూర్తి కూడా అక్కడికి చేరుకున్నాడు.

నరహరి శంకరాన్ని ఆపి "అయితే యిల్లు తగలడుతుంటే పక్క నున్న ఫైరుస్టేషన్లో చెప్పక యింటికి సంచీ పుచ్చుకుని పరుగెత్తుతావేరా?" అన్నాడు చిరునవ్వుతో.

శంకరం బేజారయిపోయాడు. రామ్మూర్తి కూడా నవ్వాడు.

వీళ్ళ నవ్వులు చూసి శంకరం కొంచెం కుదుటపడ్డాడు. ఇదేదో పన్నాగం అని నమ్మకం కుదిరింది. రామ్మూర్తి శంకరంతో "నరహరికి సహాయం చేశాను. నా తప్పేమీ లేదురోయ్ శంకరం" అన్నాడు.

నరహరి పెద్ద సత్యాన్ని నిరూపించబోతున్న వాడిలా ముఖం పెట్టి వుపక్రమించాడు! "పదండిరా పోదాం" అంతా నడుస్తున్నారు. "ఒరేయ్ శంకరం....అంత ఖంగారు పడతావేరా? కొంచెం ఆలోచించాలిరా. నిప్పంటుకున్నప్పుడు ఫైరింజను రావాలి. అంటే స్టేషన్లో చెప్పాలి. అంటే రక్షణకి కొంత సాధన సామగ్రితో బయలుదేరి వెళ్ళాలన్నమాట. అంతేగాని ఊరికే పిచ్చివాడిమాదిరి పరుగెత్తితే యెలారా నాయనా!.... కాబట్టి అది అంతా మానసిక స్థితిరా. నీ యింట్లో భార్యా, పిల్లలూ, నీ సామానూ వగైరా రక్షించుకోవాలనే వుద్దేశంలో నీకు వేరే ఏమీ తోచలేదు.... ఆ భక్తజన పాలకుడు విష్ణుమూర్తి క్కూడా కరి ప్రార్థన వినంగానే ఏమీ తెలియలేదు. పరిగెత్తాడు. ఏమంటావ్?"

శంకరం కొంచెం సిగ్గుపడ్డాడు. "ఓరీ పిడుగా— నా ప్రాణం తీశావు గదరా!.... సరే, నీవు చెప్పిందే నిజంరా.... ఒప్పుకున్నారా బాబూ.... సరేనా.... ఆఫీసు టైమయింది, త్వరగా పద" అన్నాడు.

ముగ్గురు మిత్రులు త్వర త్వరగా ఇళ్ళు చేరుకున్నారు. *

(1956)